క్లుప్తంగా

మట్టి గణపతిని పూజించాలి

కాకినాడ సిటీ: ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కలెక్టర్ కృతికా శుక్లా పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ధరిత్రి రక్షిత సమితి సంయుక్త ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ధరిత్రి రక్షిత సమితి అధ్యక్షురాలు సీమకుర్తి సురేఖతో కలసి కలెక్టర్ మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

సేవే పరమావధి కావాలి

కరప: సేవే పరమావధిగా గ్రామ వలంటీర్లు పనిచేయాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కొత్తగా ఎంపికైన పలు గ్రామాల వలంటీర్లకు నియామక ఉత్తర్వులు అందజేశారు.

ఫ్యాన్ల బహూకరణ

కరప: స్థానిక పీహెచ్‌సీకి కాకినాడ న్యూరో స్టార్ ఆసుపత్రి వారు నాలుగు సీలింగ్ ఫ్యాన్లు సమకూర్చారు. కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు పీహెచ్‌సీకి ఫ్యాన్ల అవసరాన్ని న్యూరో స్టార్ ఆసుపత్రి ఎండీ జ్యోతుల సతీష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సమకూర్చిన ఫ్యాన్లను పీహెచ్‌సీ సిబ్బందికి అందజేశారు.

పిల్లలను తీర్చిదిద్దాలి

కాకినాడ రూరల్: బాల్యం నుంచి పిల్లలను ఉత్తమంగా తీర్చిదిద్దాలని జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు అన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడబాల రత్నప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో కీచులాట



వలసపాకల వద్ద రిలే దీక్షల శిబిరం మధ్యాహ్నం తరువాత ఇలా..

కాకినాడ రూరల్: రూరల్ నియోజకవర్గ టీడీపీ నాయకులు ఆధిపత్యం కోసం ఎవరికి వారే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో రిలే నిరాహార దీక్షకు దిగిన టీడీపీ నాయకులు రెండుగా చీలిపోయారు. వలసపాకల పరిధిలో ఒకవర్గం, గైగోలుపాడులో మరోవర్గం శిబిరాలు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ దంపతులు వలసపాకల వద్ద ఉదయం రిలే దీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నానికే ఈ శిబిరాన్ని సర్దేశారు. పట్టుమని పది మంది లేకున్నా ఉనికి చాటుకునేందుకు గైగోలుపాడులో మరో వర్గం శిబిరం ఏర్పాటు చేసింది.

షెడ్డు కూల్చివేశారని ఫిర్యాదు

కరప: నడకుదురుకు చెందిన లంకే గౌరి గురజనాపల్లిలో పెంకే రాధాకృష్ణ వద్ద ఇళ్ల స్థలాన్ని కొనుగోలు చేసి రేకుల షెడ్డు నిర్మించుకుంది. గత నెల 21న విజయవాడకు చెందిన కాకుల లీలావిజయకుమారి, తన ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లు, బంధువులు ఈరుగుల విజయ్‌కుమార్, అంజనీలతో కలసి వచ్చి ఆ స్థలం తనదంటూ జేసీబీతో షెడ్డు కూల్చివేశారంటూ గౌరి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిపై ఆమె ఫిర్యాదు చేసిందని ఎస్‌ఐ ఎస్.రామకృష్ణ తెలిపారు.

రేపు బీచ్ క్లీనప్ డ్రైవ్

కాకినాడ రూరల్: ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీనప్ డేను పురస్కరించుకుని కాకినాడ సూర్యారావుపేట బీచ్ వద్ద ఇండియన్ కోస్ట్ గార్డ్, హైదరాబాద్‌కు చెందిన బయో ప్లాస్టిక్ తయారీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం బీచ్ క్లీనప్ డ్రైవ్‌ను నిర్వహించనున్నారు.

ఇంజినీర్లదే కీలకపాత్ర

బోట్‌క్లబ్: దేశాభివృద్ధిలో ఇంజినీర్ల కీలకపాత్ర అని లయన్స్ గవర్నర్ వేలూరి సూర్యనారాయణ అన్నారు. లయన్స్ ఎలైట్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డేను స్థానిక కాస్మో పాలిటన్ క్లబ్‌లో గురువారం నిర్వహించి ఇంజినీర్లను సత్కరించారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన దీక్షలు

కాకినాడ సిటీ: ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీర్మానం చేసి చట్టబద్ధత కల్పించాలని కాకినాడ ధర్నా చౌక్ వద్ద చేపట్టిన రిలే దీక్షలు గురువారం 7వ రోజుకు చేరాయి. ఈ శిబిరాన్ని ఎమ్మార్పీస్ ఎంపీఎస్ ఉత్తర కోస్తాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన సుబ్బారావు, దూలపల్లి సుబ్బారావులు సందర్శించారు.

'లక్ష్య' విద్యార్థుల ప్రతిభ

బాలాజీచెరువు: ఇటీవల నగరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని లక్ష్య పాఠశాల డైరెక్టర్ ఎన్.సుగుణారెడ్డి గురువారం తెలిపారు. 22 బంగారు, 7 రజత, 11 కాంస్య పతకాలు సాధించారని, అండర్ -12 విభాగంలో నల్లమిల్లి శేషు రిషిత రెడ్డి బంగారు పతకం సాధించిందన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ

బాలాజీచెరువు: రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ (1978) ద్వారా ఆరేళ్లలో రూ.80 లక్షలకు పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించామని ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక దేవాలయం వీధిలోని కార్యాలయంలో గురువారం ట్రస్ట్ ద్వారా రూ.1.36 లక్షల ఉపకార వేతనాలను విద్యార్థులకు అందజేశారు.

సేవ చేయడానికే మీ ముందుకొచ్చా..

- 'గడప గడపకూ ప్రభుత్వం' సంతృప్తినిచ్చింది
- ముగింపు వేడుకలో ఎమ్మెల్యే ద్వారంపూడి



గడప గడపకూ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ఎమ్మెల్యే పదవిని అలంకారప్రాయంగా చూడలేదని, ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా భావించానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం నగర నియోజకవర్గంలో గురువారంతో ముగిసింది. ఈ ముగింపు వేడుకలను స్థానిక ఏటిమొగలో ఆడంబరంగా నిర్వహించారు. బెలూన్లు ఎగురవేసి బాణసంచా కాల్చారు. ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ 2022 మే 11న ప్రారంభించిన గడప గడపకూ కార్యక్రమం 16 నెలలు కొనసాగిందన్నారు. 43 డివిజన్లు, 84 సచివాలయాల పరిధిలో సుమారు 92 వేల కుటుంబాలను కలసి ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిని వివరించడంతో పాటు సమస్యలు అడిగి తెలుసుకున్నామన్నారు. గుర్తించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున కేటాయించడంతో వాటిని వేగంగా పరిష్కరించామన్నారు. ఒక ప్రజాప్రతినిధిగా ఇది తనకెంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఎంతో మంది పేదలకు గడప గడపకూ ప్రభుత్వం ద్వారా న్యాయం చేశామని, సాంకేతిక పరమైన ఇబ్బందులు ఎదురైన చోట్ల సొంతంగా పింఛన్లు ఇవ్వడం, వివిధ సంస్థల్లో ఉద్యోగాలు, వైద్య ఖర్చులు అందించడం, సొంతంగా పింఛన్ల పంపిణీ, ఇంటి పెద్దను కోల్పోయిన పిల్లలను విద్యాపరంగా దత్తత తీసుకోవడం సహా మరెన్నో సేవలు అందించామన్నారు. ఇవి కాకుండా ప్రభుత్వం నుంచి అమ్మఒడి, విద్యాదీవెన, కాపునేస్తం, చేయూత తదితర పథకాలను కూడా ఇచ్చామన్నారు. గడప గడపకూ విజయవంతమైన నేపథ్యంలో అక్టోబర్ 1వ తేదీ నుంచి 'విన్నాం- చూశాం- చేశాం' పేరుతో మరోసారి ప్రజల్లోకి వెళ్లి సాధించిన ప్రగతిని వివరించనున్నామని అన్నారు. కాకినాడలో 30 వేల మందికి ఇళ్ల నిర్మాణంతో పాటు 15 వేలు ఉండే పింఛనుదారులను 28 వేలకు పెంచడం సంతృప్తినిచ్చిందన్నారు. ఇందుకు సహకరించిన అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. టీపీఆర్వో మానే కృష్ణమోహన్, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మత్స్యకార ప్రతినిధి కాటాడి జానకిరామ్, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు సత్తిబాబు, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, రాగిరెడ్డి బన్ని, కర్రి శైలజ, చవ్వాకుల రాంబాబు, రోకళ్ల సత్యనారాయణ, తెహరాఖాతూన్, రాజాన ప్రకాష్ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల సముదాయం పరిశీలన

టిడ్కో ఇళ్ల సముదాయాన్ని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సందర్శించారు. పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ సమక్షంలో శుక్రవారం ఇళ్ల అప్పగింత ప్రక్రియ జరగనున్న నేపథ్యంలో అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆరోగ్య సురక్షకు పటిష్ట ప్రణాళిక

కాకినాడ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధికారులకు సూచించారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో ఈ అంశంపై గురువారం సమావేశం నిర్వహించారు.

దశాబ్దాల కల సాకారం

- కొవ్వూరు ప్రజలకు ఇళ్ల పట్టాలు
- పంపిణీ చేసిన ఎమ్మెల్యే కన్నబాబు



కొవ్వూరు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: ఆ గ్రామస్తుల మూడు దశాబ్దాల కల ఫలించింది. కొవ్వూరులో 1995 నుంచి నలుగుతున్న ఇళ్ల స్థలాల సమస్యకు మోక్షం లభించింది. లబ్ధిదారులకు జీవితాంతం గుర్తుండిపోయేలా విలువైన ఇళ్ల పట్టాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పంపిణీ చేశారు. గురువారం రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో సర్పంచ్ పిల్లి చక్రరావు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ సీఎం జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తాను మంత్రిగా కొవ్వూరు సమస్యకు పరిష్కారం కోసం కృషి చేశానన్నారు. 1995 నుంచి కొవ్వూరు గ్రామస్తులకు ఇళ్ల పట్టాలు ఇచ్చినప్పటికి కోర్టుల్లో పెండింగ్, తదితర సమస్యలతో లబ్ధిదారులు అడుగు పెట్టలేని పరిస్థితి వచ్చిందన్నారు. దాదాపు 28 ఏళ్ల తరువాత తాను సమస్యను పరిష్కరించే ఉద్దేశంతో అదే స్థలంలో సుమారు 327 పట్టాలు ఇస్తున్నామన్నారు. నేమాంలోని జగనన్న లే అవుట్‌లో 689 పట్టాలు మంజూరు చేసి దాంట్లో 316 మందికి పంపిణీ చేశామన్నారు. కొవ్వూరులో 327 మందికి పంపిణీ చేస్తున్న స్థలం విలువ రూ.8 లక్షలు ఉంటుందన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ 32 లక్షల పట్టాలు ఇవ్వగా కాకినాడ రూరల్ నియోజవర్గంలో 32 వేల పట్టాలు ఇచ్చామన్నారు. పండూరు, నేమాం, తిమ్మాపురం గ్రామాల్లో 15 వేల ఇళ్లు రానున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ పక్షాన ప్రజలంతా నిలిచి సీఎంగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇళ్ల పట్టా పొందిన హిజ్రా నిఖిత మాట్లాడుతూ తమ గ్రామంలోనే మూడు దశాబ్దాల సమస్యలను పరిష్కరించి పట్టాలు ఇచ్చిన ఎమ్మెల్యే కన్నబాబుకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. ఆర్డీఓ సత్యనారాయణ, తహసీల్దార్ మురార్జీ, ఎంపీడీఓ స్వప్న, ఉప సర్పంచ్ పబ్బిసేడి సతీష్, ఎంపీటీసీలు ఊబా నాగమణి, కొండేటి లీలావతి, నాయకులు ఊబ శ్రీను, పల్లంరాజు పాల్గొన్నారు.

బడి బస్సులు వచ్చాయ్...

- పేద విద్యార్థుల కోసం ఎమ్మెల్యే వితరణ
- రెండు పాఠశాలల కోసం నాలుగు బస్సులు



విద్యార్థుల కోసం సిద్ధం చేసిన బస్సులు

కాకినాడ: కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులు లాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల వద్దకు వెళ్లిన సందర్భంలో తమ పిల్లలకు సరైన రవాణా సదుపాయం లేక పడుతున్న ఇబ్బందులను పర్లోపేట, దుమ్ములపేట ప్రాంతాలకు చెందిన పేదలు ద్వారంపూడి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన 10, 11, 12 డివిజన్లకు చెందిన పర్లోపేట, దుమ్ములపేట, రాజీవ్ గృహకల్ప, సంజయ్‌నగర్ ప్రాంతంలోని 555 మంది విద్యార్థుల కోసం కొద్దిరోజుల కిందటే రెండు బస్సులు ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతాల్లో నిరుపేద కార్మిక కుటుంబాలకు చెందిన పిల్లలకు ఏర్పాటు చేసిన బస్సులు చాలక పోవడంతో ఇప్పుడు తాజాగా మరో రెండు బస్సుల ఏర్పాటుకు నిర్ణయించారు. ఈ బస్సులను ద్వారంపూడి సమకూర్చగా, వాటి నిర్వహణ బాధ్యతలను అంటే డ్రైవర్ల జీతాలు, డీజిల్ వంటి ఖర్చులను భరించేందుకు లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు, ఇతర కార్యవర్గ సభ్యులు అసోసియేషన్ తరఫున ముందుకు వచ్చారు. దీంతో సాలిపేట బాలికోన్నత పాఠశాల, ఆనందభారతి మున్సిపల్ పాఠశాలల విద్యార్థులకు ఉచిత బస్ రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చినట్లయ్యింది. జిల్లా పర్యటనకు వస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్ ఈ బస్సులను శుక్రవారం ప్రారంభిస్తారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- సూర్యారావుపేటలో గడప గడపకూ..



సూర్యారావుపేటలో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. సూర్యారావుపేటలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత లైట్ హౌస్ పేట వద్ద గ్రామస్తులకు కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం లైట్‌హౌస్ పేట, గ్రామంలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సూర్యారావుపేటలో 90 శాతం మంది మత్స్యకారులేనని, ఈ గ్రామంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. లైట్ హౌస్ పేటలో కమ్యూనిటీ హాలును అభివృద్ధి చేస్తామన్నారు. రెండు, మూడు రోజుల్లో సుమారు 221 మందికి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. సర్పంచ్ సూర్యాడ చిన్నా, నాయకులు సూరాడ రాజు, కోమలి సత్యనారాయణ, అర్జల సింహాద్రి, దావీదు పాల్గొన్నారు. కొత్త గైగోలుపాడులో గపడ గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిర్వహించారు. పార్టీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి, నాయకులు కడియాల చినబాబు, పాలిక రమణ, మాజీ కార్పొరేటర్ ఐ.శ్రీను పాల్గొన్నారు.

స్పర్జన్‌రాజు సేవలు చిరస్మరణీయం



చిల్డ్రన్స్ హోమ్‌లో అనాథలకు భోజనం వడ్డిస్తున్న ట్రస్ట్ చైర్మన్ హరీష్

నాగమల్లితోట జంక్షన్: రంగరాయ వైద్య కళాశాల పీడీ దివంగత డాక్టర్ కె.స్పర్జన్‌రాజు క్రీడా సంఘానికి అందించిన సేవలు చిరస్మరణీయమని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. గురువారం స్థానిక రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియంలో స్పర్జన్‌రాజు ఆదరణ కూడిక, సంస్మరణ సభ జరిగింది. కన్నబాబు మాట్లాడుతూ జిల్లా క్రీడాభివృద్ధిలో స్పర్జన్‌రాజు తనవంతు సహాయ సహకారాలు అందించారన్నారు. హౌస్ ఆఫ్ ప్రేయర్ పాస్టర్ మోజెస్ ప్రత్యేక వాక్య సందేశాన్ని అందించారు. ముందుగా కన్నబాబు దివంగత స్పర్జన్‌రాజు చిత్రపటానికి పూలమాల వేశారు. చిల్డ్రన్స్ ఫెయిత్ అండ్ విజన్ అధ్యక్షుడు జయదీప్, జోసఫ్‌బెన్నీ, వైఎంసీఏ అధ్యక్షుడు హెన్నీ, మాజీ డీఎంఈ రాఘవేంద్రరావు, వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ బాడీ సతీమణి భానుమతి, ఆర్ఎంసీ డాక్టర్లు పాల్గొన్నారు. • స్పర్జన్‌రాజు సేవలు చిరస్మరణీయమని హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ అన్నారు. జగన్నాథపురంలోని రెయిన్బో చిల్డ్రన్ హోమ్‌లో అనాథ చిన్నారుల మధ్య స్పర్జన్‌రాజు సంస్మరణ సభ నిర్వహించారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు రవిరాజు, కందులూరి పాల్‌రాజ్, సునీల్ ఎం.కృష్ణలు పాల్గొని స్పర్జన్‌రాజు సేవలను కొనియాడారు. హరీష్ సమకూర్చిన భోజనాన్ని చిన్నారులకు వడ్డించారు.

'బందనహరి' పేరుతో చేపల మార్కెట్

ప్రారంభించిన ఎమ్మెల్యే ద్వారంపూడి



బందన హరి చేపల మార్కెట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: స్థానిక దుమ్ములపేట 15వ డివిజన్ మల్లారమ్మగుడి సమీపంలో రూ.42.50 లక్షలతో నిర్మించిన చేపల మార్కెట్‌ను సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి గురువారం ప్రారంభించారు. ఇటీవల మృతి చెందిన మత్స్యకార నాయకుడు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ బందన హరి పేరుతో దీనిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ చేపల వేట చేసుకుని జీవనోపాధి పొందే మత్స్యకారులకు అధునాతన సౌకర్యాలతో నిర్మించిన ఈ మార్కెట్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ఎంతో కష్టించి పనిచేసిన బందన హరి పేరును ఈ మార్కెట్‌కు పెట్టామన్నారు. డ్రై ఫిష్ మార్కెట్‌కు కూడా బందన హరి పేరు పెట్టనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పార్టీ నగర నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకట్రావు, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు, మాజీ కార్పొరేటర్లు భీమరాజు, చెవ్వకుల రాంబాబు, మత్స్యకార నాయకుడు కాటాడి జానకిరామ్, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, బందన శివ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: విద్యుత్ వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ జగన్నాథపురం, అన్నమఘాటీ విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ జి.ప్రసాద్ తెలిపారు. ముత్తానగర్, గోళీలపేట, వలందపేట, తుపాన్ బిల్డింగ్, పోర్టుకాలనీ, జె.రామారావుపేట, చిన్నమార్కెట్, ఏసువారివీధి, పాత జగన్నాథపురం వంతెన, మున్సబుగారి జంక్షన్, ఎంఎస్ఎన్ చారిటీస్, చర్చిస్క్వేర్, పురంవారివీధి, నరసింహారోడ్డు తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

రేపు క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్: పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాకినాడ అర్బన్ మండల క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు అర్బన్ మండల స్పోర్ట్స్ నిర్వాహకుడు పీడీ పట్టాభి గురువారం తెలిపారు. అండర్-14, 17 బాలురు, బాలికల విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, టెన్నికాయిట్, యోగ, అథ్లెటిక్స్‌లో ఎంపికలు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఉంటాయన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నామట్టి- నాదేశం

కరప: నడకుదురు, పెనుగుదురు తదితర గ్రామాల్లో మండల బీజేపీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వరరావు ఆధ్వర్యంలో నామట్టి-నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు పుట్టా వీరప్రసాద్‌గాంధీ, చోడిశెట్టి రమేష్‌బాబు పాల్గొన్నారు.

బోట్‌క్లబ్: స్థానిక ఎల్‌బీ నగర్‌లో నా భూమి- నా దేశం కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్నీడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు పైడా రవీంద్ర, కవికొండల భీమశంకర్, గౌతు చిన్నా పాల్గొన్నారు.

అభివృద్ధే అజెండాగా పాలన

ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కరప: పల్లెల అభివృద్ధే అజెండాగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ హయాంలో 65 ఏళ్ల వయసు వారికే పింఛన్లు ఇచ్చేవారని, అదీ ఆ పార్టీ నాయకులు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక 60 ఏళ్లకు వయసు తగ్గించడమే కాకుండా అర్హులందరికీ ఇంటి వద్దే వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేయించి అందిస్తున్నారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు కావడంతో ఆయన అవినీతి బండారం బయటపడిందని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటుకు రూ.3,330 కోట్ల పెట్టుబడిలో ప్రభుత్వం వాటాగా రూ.370 కోట్లు చెల్లించేందుకు ఒక కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని, మకొకరికి సొమ్ములు చెల్లించి, వాటిని చంద్రబాబు ఖాతాలో వేసుకుని అడ్డంగా దొరికిపోయారన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వమే బయటపెట్టిందని వివరించారు. అనంతరం ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు తదితర నాయకులతో కలసి ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ భీమేశ్వరరావు, ఆచార్య ఎన్‌జీ రంగా వర్సిటీ బోర్డు సభ్యుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు గణేష్ పాల్గొన్నారు.

హిందీ భాషా దినోత్సవం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవం జరిగింది. పీఆర్ ప్రభుత్వ కళాశాల హిందీ విభాగాధిపతి పి.హరిరామ ప్రసాద్‌ను అడబాల రత్నప్రసాద్, డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్ తదితరులు సత్కరించారు.

బాలాజీచెరువు: స్థానిక పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవం జరిగింది. హిందీ విభాగాధిపతి డాక్టర్ పసుపులేటి హరిరామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణ మూర్తి జెడ్పీ హైస్కూల్‌లో హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు మహబూబ్ అలీ, బాషా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఉప్పులూరి' కృషి మరువలేనిది



వేద సభలో మాట్లాడుతున్న మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి

బోట్‌క్లబ్: స్థానిక రామారావుపేట గాయత్రి కల్యాణ మండలంలో ఉప్పులూరి గణపతి శాస్త్రి 41వ వార్షిక వేదశాస్త్ర పండిత సభ గురువారం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాల కృష్ణ శాస్త్రి మాట్లాడుతూ పండితులు నేడు సగర్వంగా వారి విద్యను ప్రదర్శించుకోవడానికి అనువైన స్థానాలను కల్పించడంలో స్వర్గీయ ఉప్పులూరి గణపతిశాస్త్రి చేసిన కృషి మరువలేనిదన్నారు. నిత్యం ఆయనను స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వేదాలతో నిక్షిప్తమైన అనేక విషయాలను నేటి సమాజానికి అందించడంలో పండితులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిషత్ నివేదికను కార్యదర్శి రాయప్రోలు ప్రసాదశర్మ చదివి వినిపించారు. కార్యక్రమంలో గుళ్లపల్లి సీతారామచంద్రమూర్తి, దువ్వూరి యజ్ఞేశ్వరఫణి, దువ్వూరి సూర్యప్రకాశ సోమయాజులు పాల్గొన్నారు.